క్లుప్తంగా

శక్తిపీఠం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



నారాయణపేట: శ్రీసంత్ మహా సంస్థానం శక్తి పీఠం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సుభాష్ రోడ్‌లో చలివేంద్రం ఏర్పాటు చేశారు. శక్తిపీఠం బోర్డ్ ఆఫ్ ట్రస్టీ డాక్టర్ దేశాయ్ మదన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామీజీ శాంతనంద్‌పురోహిత్ మాట్లాడుతూ శక్తిపీఠం ఆధ్వర్యంలో గోసేవ, అన్నదాన సేవ తదితర సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని అన్నారు. అదేవిధంగా చలివేంద్రం ప్రారంభించామని తెలిపారు. శక్తి పీఠం మార్గదర్శకులు ఊట్కూర్ యజ్ఞనారాయణరావు పురోహిత్, వివిధ విభాగాల ప్రముఖులు, సభ్యులు మురళీ, దోమ సుధాకర్, రుద్రసముద్రం రాములు, అకులబాలప్ప, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాజాపూర్‌లో..



నారాయణపేట రూరల్ : మండలంలోని జాజాపూర్ కొత్త కాలనీలో ఆదివారం కోట్ల ధీరజ్‌రెడ్డి, శ్యామ్ సుధాకర్‌రెడ్డిల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతు సమన్వయ సమితి నాయకులు జగన్మోహన్‌రెడ్డి మాట్లాడారు. సర్పంచ్ సుగంధమ్మ, నాయకులు రవిందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి, సురేష్ రెడ్డి, వెంకటప్ప, కతలప్ప, ఆనంద్, మనోహర్, అలీశేర్, వెంకటేష్, నసీర్ పాల్గొన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

మాగనూర్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో సోమవారం లబ్ధిదారులకు మంజూరైన 82 కల్యాణలక్ష్మి , షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నారు. స్థానిక ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ అమీర్, ఆర్‌ఐ శ్రీశైలం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లబ్ధిదారులు, జెడ్పీటీసీ, ఎంపీపీ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు సకాలంలో హాజరుకావాలని కోరారు.

రాయికోడ్‌లో ఇఫ్తార్ విందు



నర్వ: మండలంలోని రాయికోడ్‌లో ఆదివారం సాయంత్రం ముస్లింలకు సింగిల్‌విండో డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వారికి మాజీ జెడ్పీటీసీ, విండో డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పండ్లను తినిపించి విందును ప్రారంభించారు. కార్యక్రమంలో అబ్దుల్ జబ్బార్, ఖాజా, ఉస్మాన్, ఫసీ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల పండుగ



నారాయణపేట రూరల్ : మండలంలోని సింగారంలో ఆదివారం క్రైస్తవులు మట్టల పండుగ (పామ్ సండే) నిర్వహించారు. ఉదయాన్నే యేసు ప్రభువును స్మరించుకుంటూ మట్టలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఇమ్మాన్యుయేల్ చర్చిలో ఆరాధన, ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఈ సందర్భంగా ఫాస్టర్ పాల్ మాట్లాడుతూ.. ఈస్టర్ పర్వదినం ముందు వచ్చే ఆదివారం రోజున మట్టల పండుగ జరుపుకొంటారనిఅన్నారు. పండగ సందేశాన్ని చదివి వినిపించారు. కార్యక్రమంలో క్రైస్తవ మత పెద్దలు, యువకులు, మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

'టోల్‌గేట్' పెంపు సాకుతో టికెట్ రేట్లు పెంచొద్దు

అమరచింత: టోల్‌గేట్ చార్జీల పెంపుతో రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో చార్జీలు పెంచే ఆలోచనలను విరమించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మోష డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఏఐటీయూసీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిల్లర సమస్య ఉందని రూ.పది, ఇరవై ఇలా పెంచుకుంటూ పోయారని గుర్తు చేశారు. మళ్లీ టోల్‌గేట్ ధరలు పెరిగాయంటూ వాటి భారాన్ని ప్రజలపై మోపకూడదని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అబ్రహం, నాయకులు శ్యాంసుందర్, తిరుపతి, ఇజ్రాయిల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల కొరతతో విలవిల



మాగనూర్ పంచాయతీ కార్యాలయం

- పంచాయతీల్లో ముందుకు సాగని పనులు
- నిర్వహణ కోసం అప్పులు చేస్తున్న సర్పంచ్‌లు

మాగనూర్: గ్రామాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వాలు జనాభా ఆధారంగా ఆయా పంచాయతీలకు నిధులు కేటాయిస్తున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా ఇటీవలి కాలంలో నిధుల మంజూరులో జాప్యం జరుగుతుండడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోంది. ఆయా అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. వివిధ పనుల నిర్వహణకు సర్పంచ్‌లు ఆపసోపాలు పడుతున్నారు. పంచాయతీ సిబ్బందికి వేతనాలూ ఇవ్వలేకపోతున్నారు. ఇదిలా ఉంటే కొన్ని గ్రామాల సర్పంచ్‌లు పనుల నిర్వహణ కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి తలెత్తుతోందని వాపోతున్నారు. సాధారణంగా మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు జనాభా ప్రతిపాదికన ప్రతి నెలా కేంద్రం ఇచ్చే 15వ (ఎఫ్‌ఎఫ్‌సి) ఆర్థిక సంఘం నిధులకు, రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌ఎఫ్‌సీ ద్వారా నిధులు జమ చేస్తోంది. కాగా ఇటీవలి కాలంలో కేంద్రం ఇచ్చే నిధులు జమ కాకపోగా రాష్ట్రం ఇచ్చే ఎస్‌ఎఫ్‌సీ నిధులు రెండు పర్యాయాలు మాత్రమే పంచాయతీలకు చేరాయి. మళ్లీ ఇప్పటి వరకు ఒక్కరూపాయి కూడా రాలేదు. ప్రత్యేకంగా ఖాతాలు తెరవాలని కేంద్రం ఆదేశించడంతో అన్ని పంచాయతీలు ఖాతాలు తెరిచాయి. కానీ నాటి నుంచి కేంద్రం నిధుల జాడ లేదు. నిధుల మంజూరు కొరత ఒకవైపు వేధిస్తుంటే పన్ను రూపంలో వస్తున్న ఆదాయమూ అరకొరగా ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. నిధులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొనడంతో ఎటూ అడుగులు వేయలేకపోతున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు కోరుతున్నారు.

అప్పు చేయాల్సి వస్తోంది



గ్రామ పంచాయతీలకు కొంతకాలంగా ప్రభుత్వాలు అందించాల్సిన నిధులు రావడం లేదు. దీంతో చేపట్టిన అభివృద్ధి పనుల కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. వాటికి వడ్డీలూ కట్టలేని పరిస్థితి దాపురించింది. నిర్వహణ భారంగా మారింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే మరింత దారుణంగా మారుతుంది. ఇప్పటికైనా నిధులు ఇవ్వాలి.

– నర్సింహులు, సర్పంచ్, వడ్వాట్

నిధులు విడుదల చేయాలి



గ్రామాలలో పనులు జరగాలంటే కనీస నిధులు ఉండాలి. కానీ ప్రస్తుతం జీపీలలో నిధుల కొరత వల్ల పంచాయతీ కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు కూడా ఇవ్వలేకపోతున్నాం. పన్నులు వస్తున్నా అవి ఏ మూలకు సరిపోవడం లేదు. ఇప్పటికైనా నిధులు మంజూరు చేయాలి.

– నారాయణ, ఓబ్లాపూర్ సర్పంచ్

సమస్య పరిష్కరిస్తాం



ప్రస్తుతం చాలావరకు గ్రామపంచాయతీల్లో నిధులు ఉన్నాయి. కానీ వాటిని బ్యాంకుల నుంచి తీసుకోవాలంటే సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నెలలో కచ్చితంగా సమస్య పరిష్కరిస్తాం. పంచాయతీలకు నిధులు అందేలా చూస్తాం.

– జైపాల్‌రెడ్డి, మండల పంచాయతీ అధికారి, మాగనూర్

ఢిల్లీకి తరలిన నాయకులు

నారాయణపేట టౌన్ : కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న ఢిల్లీలో చేపట్టే మజ్దూర్ కిసాన్ సంఘ్ ర్యాలీకి జిల్లా నుండి 50 నాయకులు సీఐటీయూ ఆధర్వంలో ఆదివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా సీఐటీయూ కన్వీనర్ బాల్‌రాం, కో-కన్వీనర్ ఆంజనేయులు మాట్లాడారు. కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని అన్నారు. తరలివెళ్లిన వారిలో ఆయా సంఘాల నాయకులు వెంకటయ్య, రవి, సాయిలు, శివకుమారి, అయేషా, మమత, కనకప్ప, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

కోస్గి: మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి, ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు కర్నె శ్రీశైలం వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో పలువురు యువకులు పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. స్థానిక గ్రంథాలయ ఆవరణలో పాలమూర్ బ్లడ్ బ్యాంక్ వారి సహకారంతో కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 47 మంది రక్తదానం చేశారు. శిబిరాన్ని ఏర్పాటు చేసిన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీబీ వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు పోకల లక్ష్మణ్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వాస్పత్రి వైద్యులు అనుదీప్, ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యుల అసోసియేషన్ అధ్యక్షుడు పూర్ణచందర్ యాదవ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

పార్వతీ పరమేశ్వరుల రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కృష్ణా: మండల పరిధిలోని చేగుంట బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం శ్రీపార్వతీ పరమేశ్వరుల రథోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. క్షీరలింగ మహాస్వామి ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య, మంగళవాయిద్యాలతో కన్నులపండువగా రథోత్సవం చేపట్టారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు, అలంకరణ, రుద్రాభిషేకం, బిల్వార్చన చేశారు. పల్లకీసేవ, నందికోలు ఉత్సవం నిర్వహించారు. అనంతరం మఠాధిపతులు భక్తి ప్రవచనాలు బోధించారు. భజనమండలి వారు సంకీర్తలను ఆలపించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుంగా నిర్వాహకులు తాగునీరు, వసతి, భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు.

ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే

కృష్ణా: మండలంలోని చేగుంటలో జరుగుతున్న ఉత్సవాల్లో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆదివారం సాయంత్రం పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు స్వామివారి రథోత్సవ కార్యక్రమంలో ఆలయ అధిపతి శ్రీ క్షీరలింగేశ్వర స్వామితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భం గా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేను సన్మానించారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు విజప్పగౌడ, సర్పంచ్ శివప్ప, జెడ్పీటీసీ తనయుడు శివరాజ్‌పాటిల్, స్థానిక నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. మక్తల్ సీఐ సీతయ్య, ఎస్‌ఐ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



పెద్దజట్రంలో..



మాట్లాడుతున్న ఎస్‌ఐ పర్వతాలు

మక్తల్: పట్టణంలో శ్రీదయానంద విద్యామందిర్ ఆవరణలో పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కర్నిస్వామి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. మక్తల్ ఎస్‌ఐ పర్వతాలు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ అలవరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ రమేష్‌రావు, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, పూజారి తిప్పయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని పెద్దజట్రం ప్రాథమిక పాఠశాలలో శనివారం రాత్రి ఘనంగా వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్య, సర్పంచ్ కతలప్ప, ఎంపీటీసీ కిరణ్‌కుమార్, మాజీ సర్పంచ్ సాయిల్‌గౌడ్, హెచ్‌ఎం ధనుంజయ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

మరికల్: కొత్తగా ఏర్పడిన మరికల్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, హరిప్రసాద్, శ్రీనివాసులు అన్నారు. ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడారు. మరికల్‌తో పాటు జిల్లాలో మరికొన్ని మండలాలు ఏర్పడ్డాయన్నారు. జూనియర్ కళాశాల లేకపోవడంతో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాంటి వారి కోసమైనా కళాశాలను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందన్నారు.

5 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఊట్కూరు: మండలంలోని పగిడిమర్రిలో ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 5 నుంచి ప్రారంభం కానున్నట్లు సర్పంచ్ సులోచన, ఆలయ కమిటీ సభ్యులు మురళీధర్‌రెడ్డి, బసవరాజుగౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం హనుమాన్ గాయిత్రియజ్ఞం, గురువారం సీతారామచంద్రస్వామి కల్యాణం, సాయంత్రం రథోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

కమిటీ ఎన్నిక

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని సాయి విజయ్ కాలనీలో ఆదివారం కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గందె ఉమాకాంత్, గౌరవాధ్యక్షులుగా హరినారాయణ భట్టడ్, ఎవీ మందార్, ప్రధాన కార్యదర్శిగా చిట్టెం మాధవరెడ్డి, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ గౌడ్, చంద్రు తదితరులను ఎనుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులతో గౌరవాధ్యక్షులు ప్రమాణ స్వీకారం చేయించారు.

రాయితీని వినియోగించుకోండి

కోస్గి: మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను వసూలు నేపథ్యంలో ప్రత్యేకంగా రాయితీ కల్పిస్తున్నట్లు కమిషనర్ పూర్ణచందర్ రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 30 వరకు ఆస్తి పన్ను చెల్లించిన వారికి 5 శాతం రాయితీ ఇస్తున్నట్లు వివరించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పట్టణ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. పూర్తి వివరాలకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

శాస్త్రీయ సంగీతంతో మానసికోల్లాసం



నారాయణపేట టౌన్ : చిన్నారులకు దేశ సంస్కృతి సాంప్రదాయాలు, శాస్త్రీయ సంగీతం నేర్పించాలని మధ్య ప్రదేశ్‌కు చెందిన శాస్త్రీయ సంగీత గాయని అశ్విని పరాందామి అన్నారు. శాస్త్రీయ సంగీతం నేర్చుకోవడం వల్ల మానసిక ఉల్లాసంతో పాటు దీర్ఘకాలిక రోగాలు దరి చేరవని అన్నారు. ఆదివారం కౌన్సిలర్ సిద్ది విశాలాక్షి నివాసంలో ఎస్పీ బాలసుబ్రహ్మణం అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఆమెకు సన్మానం నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీ, ఎస్పీ బాలు ఫ్యాన్స్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వసంత్‌కుమార్, సువర్ణ పాల్గొన్నారు.

కోటకొండ వాసికి అవార్డు



నారాయణపేట రూరల్ : కురుమూర్తి స్వామి దేవాలయ పాలక మండలి ఆధ్వర్యంలో బెల్లం సత్యమ్మ స్మారక ట్రస్ట్ వారి ఉగాది సాహితి, సాంస్కృతిక సేవారంగ అవార్డును కోటకొండకు చెందిన ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్.నారాయణ అందుకున్నారు. ఈ మేరకు ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో రత్నమాల స్మారక ఉత్తమ ప్రతిభ అవార్డును ఆలయ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, సంస్థానాధీశ వారసులు రాజా భూపాల్ సంయుక్తంగా అందించారు. ఆయనను శాలువాతో సత్కరించారు. కోటకొండ ప్రజాప్రతినిధులు, గ్రామ అధికారులు, నాయకులు నారాయణకు అభినందనలు తెలిపారు.

లక్ష్యం నిర్దేశించుకుని చదువుకోవాలి



బహుమతులు అందిస్తున్న డీఈఓ లియాకత్ అలీ

నారాయణపేట రూరల్ : ప్రతి విద్యార్థి తన జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకుని అందుకు అనుగుణంగా విద్యను అభ్యసించాలని డీఈఓ డాక్టర్ షేక్ లియాకత్ అలీ సూచించారు. పట్టణంలోని రవితేజ అకాడమిలో ఆదివారం రాత్రి నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వెనుక బడిన ప్రాంతంగా పేరున్న నారాయణపేటలో ఐఐటీ, నీట్‌కు ఫౌండేషన్ కోర్సు ప్రారంభించడం అభినందనీయమన్నారు. జాతీయ స్థాయిలో జరిగే పోటీ పరీక్షల్లో రాణించాలంటే ఇలాంటి శిక్షణ ఎంతో అవసరమన్నారు. విద్యారంగంలో అభివృద్ధి జరిగితే జిల్లా ముందుకు పోతుందని, ఉపాధ్యాయులు సూచించిన విధంగా విద్యార్థులు నడుచుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఇక విద్యార్థులు పరీక్షల ఒత్తిడిని అధిగమించాలని, ఆత్మవిశ్వాసంతో రాయాలన్నారు. లక్ష్యం లేని చదువు వ్యర్థమని, తల్లిదండ్రులను గౌరవించాలని, క్రమశిక్షణతో మెలుగుతూ ఉన్నత స్థాయికి చేరినా తొలిమెట్టును మరువరాదన్నారు. నాయకత్వ లక్షణాలను వివరించారు. వివిధ పోటీ పరీక్షల్లో పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించిన చిన్నారులు, తరగతి వారీగా టాపర్లు, క్రీడాపోటీల విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో టాస్ కోఆర్డినేటర్ యాదయ్యశెట్టి, ఉపాధ్యాయులు యాద్గీర్‌నారాయణరెడ్డి, విశ్వనాథ్, జానకి, అమ్మకోళ్ల భాస్కర్ రెడ్డి, రాధిక మహేష్, డాక్టర్ గీత, డాక్టర్ జయచంద్రమోహన్, అశోక్ పాల్గొన్నారు.

ఎస్‌ఐకి సన్మానం

మరికల్: మండల ఎస్‌ఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన హరిప్రసాద్‌రెడ్డిని ఆదివారం మండల కాంగ్రెస్ నాయకులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారితో ఎస్‌ఐ మాట్లాడుతూ రాజకీయంగా చేయాల్సిన ఆందోళన కార్యక్రమాలు శాంతియుతంగా ఉండాలని, ఆందోళనకరంగా ఉండొద్దని వారికి సూచించారు. ఆయా కార్యక్రమాలకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీరన్న, కృష్ణయ్య, హరీష్, మల్లేష్, మహేష్, రాజు, రవి, మల్లారెడ్డి, నాగరాజ్‌లు పాల్గొన్నారు.



షూటింగ్‌బాల్ పోటీలు ప్రారంభం



మక్తల్: పట్టణంలో షూటింగ్ బాల్ పోటీలను జిల్లా అథ్లెటిక్స్ చైర్మన్ నర్సింహగౌడ్ ప్రారంభించారు. జిల్లా షూటింగ్ బాల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో మొదటగా క్రీడాకారులను పరిచయం చేసుకుని ఆరంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు శిక్షణ పొందాలని అన్నారు. జిల్లా అధ్యక్షుడు తాన్‌సింగ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం, సత్యాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఆవిష్కరణకు ఆహ్వానం

నర్వ: మండలంలోని రాయికోడ్‌లో ఈ నెల 11న చేపట్టనున్న విగ్రహాల ఆవిష్కరణకు నిర్వాహకులు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయనను కలిసి జిల్లాలో మొట్టమొదటి సారిగా రాయికోడ్‌లో మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరందిస్తాం

ఈ సందర్భంగా భూత్పూరు రిజర్వాయర్ నుంచి సాగునీటిని విడుదల చేయాలని రాయికోడ్ రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే నీటి విడుదలపై ఇరిగేషన్ అధికారులతో చర్చిస్తామని, రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎంపీపీ జయరాములుశెట్టి, సర్పంచ్ సుశీల, ఉప సర్పంచ్ తాయన్నగౌడ్ తదితరులు ఉన్నారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

మక్తల్: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో మక్తల్‌లోని ఆయా కేంద్రాల్లో అధికారులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు ఎంఈఓ లక్ష్మీనారాయణ మాట్లాడారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్ష సమయం ఉంటుందన్నారు. పట్టణంలోని 6 కేంద్రాల్లో 1450 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వివరించారు. విద్యార్థులు సమయానికి కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఆయా కేంద్రాల వద్ద మక్తల్ సీఐ సీతయ్య, ఎస్‌ఐ పర్వతాలు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

అంబలి కేంద్రం ఏర్పాటు



అంబలికేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్: కొత్తసూగయ్య, రత్నమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని శ్రీపడమటి ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర అంబలి కేంద్రంను ఏర్పాటు చేశారు. మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా కేంద్రాన్ని ప్రారంభించారు. ఏటా సంవత్సరం అంబలి కేంద్రం ఏర్పాటు చేయడంపై నిర్వాహకులను అభినందించారు. మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్, మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

పట్టణంలో జాతీయ రహదారి పక్కన అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే పాల్గొని ప్రారంభించారు. యువజన సంఘం అధ్యక్షుడు పోస్టు నర్సిములు, కార్యదర్శి విజయ్, బండారి ఆనంద్, అచ్చప్ప, ఆనంద్, దినేష్, పాల్గొన్నారు.

పంటలను రక్షించాలని వినతి

మక్తల్: రైతులు పండించిన పంటలను అడవి జంతువులు నాశనం చేస్తున్నాయని రక్షణ కల్పించాలని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు కావలి వెంకటేష్ ఆధ్వర్యంలో వినతి పత్రం ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందించి అధికారులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అనంతరెడ్డి, పటేల్‌రంగారెడ్డి, కాలేశ్వర్‌ప్రతాప్‌రెడ్డి, కుర్మయ్య, వెంకట్‌రెడ్డి, నర్సిములు, తిరుపతి పాల్గొన్నారు.

పరీక్షల్లో సత్తాచాటాలి



మద్దూరు: పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు సత్తాచాటాలని జిల్లా సాంఘిక సంక్షేమాధికారిణి కన్యాకుమారీ అన్నారు. శనివారం రాత్రి మద్దూరులోని ఎస్సీ హాస్టల్‌లో వార్షికోత్సవం నిర్వహించిన సందర్భంగా పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సర్పంచ్ అరుణ, వివిధ హాస్టళ్ల వార్డెన్లు వెంకటేష్, ఆంజనేయులు, జగదీశ్వర్‌రెడ్డి, నిర్మల, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు నర్సప్ప, భాస్కర్, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు తరలిన నాయకులు

నర్వ: ఆత్మకూర్ మండలంలోని రేచింతలలో ఆదివారం ఇందిరాగాంధీ విగ్రహావిష్కరణకు మండల కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమానికి ములుగు ఎమ్మెల్యే సీతక్క ముఖ్య అతిథిగా వస్తున్నట్లు వివరించారు. జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, నాయకులు రాజుల ఆశిరెడ్డి, పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్, నాయకులు కృష్ణారెడ్డి, శరణప్ప, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వివేకవర్ధన్‌రెడ్డి, ఆటో ఆయ్యప్పరెడ్డి, సంజీవరెడ్డి, రవి, మహేష్, తదితరులున్నారు.

